దేశమంతటా బిజెపి వ్యతిరేక గాలి

- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి
- హోదా ఇవ్వని బిజెపి కూటమిలో చంద్రబాబు ఎలా చేరారు?
- విశాఖలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్

పార్వతిపురం మన్యం జిల్లా పాలకొండలో నిర్వహించిన ర్యాలీలో బృందాకరత్, పుణ్యవతి, సుబ్బరావమ్మ, రెడ్డి వేణు సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స, పాలకొండ కాంగ్రెస్ అభ్యర్థి చంటిబాబు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో బిజెపి వ్యతిరేక గాలి వీస్తోందని, గడచిన పదేళ్లలో ఎన్‌డిఎ పాలనలో అధిక ధరలు, ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసానికి పాల్పడుతూ దేశాన్ని ప్రమాదంలో పడేసిందని, దేశ రక్షణ, ప్రజల అజెండాతో ఇండియా వేదిక 2024 ఎన్నికల్లో అధికారంలోకి రానుందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ వెల్లడించారు. ఉత్తరాంధ్రలో ఇండియా వేదిక తరపున ప్రచారానికి విచ్చేసిన ఆమె ఆదివారం ఉదయం విశాఖలోని సిపిఎం కార్యాలయం (ఎన్‌పిఆర్ భవన్) లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రసంగించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి, గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ పార్టీ తరపున విశాఖ పార్లమెంట్ బరిలో దిగిన సత్యారెడ్డి, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఐ అభ్యర్థి విమల అభ్యర్థిత్వాలకు మద్దతుగా తాను విచ్చేశానన్నారు.

ఏపికి విభజన హామీలైన ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు అమలులో బిజెపి విఫలమైందని బృందా ఎద్దేవా చేశారు. 2018లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసమే తాను బయటకొస్తున్నానని చెప్పి , ఏపికి హోదా ఇవ్వని బిజెపితో 2024 ఎన్నికల్లో కూటమి ఎలా కడతారని చంద్రబాబును ప్రశ్నించారు. దేశంలోని ఇండియా వేదికలో అనేక ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు, లెఫ్ట్ పార్టీలు సహా ప్రత్యామ్నాయంగా ఏర్పడి 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర హోదా, పోలవరం, రైల్వే జోన్ కోసం ఎన్నికల బరిలో దిగామన్నారు. 2018లో దేశ ప్రధాని మోడీ విశాఖపట్నం వచ్చి ఎన్నో హామీలు కురిపించి వెళ్లారని అందులో రైల్వేజోన్‌కు నేటికీ అతీగతి లేదన్నారు. ప్రత్యేక హోదా ఎలాగూ కాగితాలకే పరిమితం అయిపోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయాల్సి ఉన్నా మోడీ ప్రభుత్వం ఇన్నాళ్లూ ఏం చేసిందని ప్రశ్నించారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో తాను పర్యటిస్తానని, గిరిజనులు, నిర్వాసితుల కోసం ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.

బాక్సైట్ దోపిడీకే బిజెపి అభ్యర్థి పోటీ

రాజ్యాంగం ద్వారా గిరిజనులకు దక్కిన హక్కులకు విశాఖపట్నం ఏజెన్సీలో రక్షణ లేదన్నారు. అనకాపల్లి ఎన్‌డిఎ కూటమి (బిజెపి) అభ్యర్థి సిఎం రమేష్‌పై ఇల్లీగల్ మైనింగ్ కేసులున్నాయని ఇలాంటి వారిని గెలిపించాలని ప్రధాని నరేంద్రమోడీ విశాఖ కశింకోటలో ప్రచారానికి రావడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. బాక్సైట్ భూముల్లో మైనింగ్ చేసేందుకే సిఎం రమేష్ అనకాపల్లి ఎంపిగా బరిలోకి దిగారని వ్యాఖ్యానించారు.

స్టీల్‌ప్లాంట్‌పై మోడీ కుట్రలు

పోర్టులు కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చే దేశ సంపద కాగా విశాఖలోని గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టారని ప్రధానితో అదానీ స్నేహంతో దీన్ని కబ్జా చేశారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రను గంగవరం పోర్టు అమలు చేస్తుందన్నారు. తక్షణమే కోర్టు చెప్పిన ప్రకారం కార్మికులతో యాజమాన్యం చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం గాజువాక అభ్యర్థి జగ్గునాయుడు మాట్లాడుతూ.. లక్ష మందికి ఉపాధి, గాజువాక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే స్టీల్‌ప్లాంట్‌ను బిజెపి, వైసిపి, టిడిపి చెర నుంచి కాపాడుకుంటామన్నారు. విశాఖ పార్లమెంట్ (కాంగ్రెస్ అభ్యర్థి) సత్యారెడ్డి మాట్లాడుతూ... ఏడు అసెంబ్లీల్లో ఐదు ఇండియా వేదికకు బలంగా ఉన్నాయని, సిపిఐ పశ్చిమ ఎమ్మెల్యే అత్తిలి విమల మాట్లాడుతూ.. ఇండియా వేదికను ప్రజలు ఓటేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.

కులగణనను వ్యతిరేకించిన

బిజెపితో పొత్తు తగదు

- జస్టిస్ వి ఈశ్వరయ్య

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

కులగణనను వ్యతిరేకిస్తూ ముస్లిం రిజర్వేషన్లు ఏత్తేస్తామని ప్రకటించిన బిజెపితో టిడిపి, జనసేన పొత్తు తగదని జాతీయ బిసి కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి ఈశ్వరయ్య అన్నారు. గుంటూరులోని ఓ హోటల్‌లో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాను అన్ని రాష్ట్రాలు తిరిగి బిసిల స్థితిగతులపై అధ్యయనం చేశానని, సిఎం జగన్ కులగణన ప్రారంభించడం సంతోషదాయకమని అన్నారు. ఇది ఎన్నికల కారణంగా తాత్కాలికంగా ఆగినా నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. రూ.వేల కోట్లు కేటాయించి ప్రభుత్వ బడులు, ఆస్పత్రులను కార్పొ రేట్‌కు దీటుగా తీర్చిదిద్దడం హర్షణీయమన్నారు. సమావేశంలో హైకోర్టు న్యాయవాది ఠాగూర్ యాదవ్, న్యాయవాది పోకల వెంకటేశ్వరరావు, బిసి నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మాఫియా రాజ్యం

- ఎర్రగుంట్ల, ఆదోనిలో రాజ్‌నాథ్‌సింగ్

ఆదోనిలో మాట్లాడుతున్న రాజ్‌నాథ్‌సింగ్

ప్రజాశక్తి - కడప, కర్నూలు ప్రతినిధులు

రాష్ట్రంలో లిక్కర్, ఇసుక, మైన్స్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆరోపించారు. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్లలోనూ, కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్వహించిన సభలు, రోడ్ షోల్లో ఆయన పాల్గొన్నారు. ఎన్‌డిఎ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.13.5 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలు, జమ్ముకాశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి వాటి గురించి ఆయన మాట్లాడుతూ బిజెపి చర్యలను సమర్థించుకున్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు ఇచ్చినా వాటిని ఖర్చు చేయడంలో వైసిపి విఫలమైందన్నారు. కడప స్టీల్ గురించి, రాయలసీమ ప్రాంతాభివృద్ధికి బిజెపి ఏం చేసిందనే విషయంపైన కానీ ఆయన నోరు మెదపలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని కూడా ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి స్థానిక నేతలు పాల్గొన్నారు.

పట్టాలపై బండరాయి.. ఢీకొన్న గూడ్స్ రైలు



కెకె లైన్‌లో బండరాయిని ఢీకొన్న గూడ్స్ రైలు

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

కొత్తవలస - కిరండూల్ లైన్‌లో బొడ్డవర, శివలింగపురం మార్గమధ్యంలో పట్టాలపై పడిన బండరాయిని గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో రైలు పట్టాలు తప్పడం గానీ, పక్కకు ఒరగడం గానీ జరగకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కిరండూల్ నుంచి ఐరన్ హోల్ లోడుతో విశాఖకు గూడ్స్ రైలు వస్తోంది. ఆదివారం తెల్లవారుజామున శివలింగపురం, బొడ్డవర 44వ మైలురాయి వద్ద అప్పటికే కొండమీద నుంచి బండరాయి పడింది. దీన్ని గమనించిన పైలట్ ఒక్కసారిగా ట్రైన్ బ్రేకులు వేశారు. దీంతో రైలు ముందు భాగం రాయిని ఢీకొట్టి అలానే ఆగిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు అటుగా రాకపోకలు సాగించే రైళ్లను నిలిపివేశారు. రాయిని పట్టాల మీద నుంచి తొలగించే పనులు చేపట్టారు. ఆ తరువాత రైళ్ల సేవలను పునరుద్ధరించారు. ఈ మార్గంలో నడిచే పాసింజర్ రైళ్ల ప్రయాణికులు తాజా ఘటనలో కొంత అసౌకర్యానికి గురయ్యారు.

రాజ్యాంగ రక్షణకు ఇండియా వేదిక

- ఏలూరు రోడ్‌షోలో కె.రామకృష్ణ

రోడ్‌షోలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఇండియా వేదిక అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం జిల్లా కేంద్రమైన ఏలూరులోని పవర్‌పేట రైల్వే స్టేషన్ నుంచి ఆర్ఆర్‌పేట మీదుగా పత్తేబాద రైతుబజార్ వరకూ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కు సెంటర్‌లో రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మత విశ్వాసాల పట్ల విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. పదేళ్ల బిజెపి పాలనలో ప్రతిపక్షాలు, మేధావులు, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. బిజెపి మతతత్వ పాలనతో ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ అధికారం కోసం బిజెపి కుట్రలు చేస్తోందని, తనకు అనుకూలంగా లేని పార్టీలపై ఇడితో దాడులు చేయించి అక్రమ అరెస్టులు చేయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.20, రూ.30 కోట్లు ఖర్చు పెట్టే అభ్యర్థులు రంగంలో ఉన్నారని, అలాంటివారు గెలుపొందితే పేదల సమస్యలపై ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. పేదలు, కార్మికులు, రైతుల పక్షాన పోరాడే వారే అసెంబ్లీ, పార్లమెంటులో ఉండాలని అన్నారు. అందుకోసం ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా ఏలూరు ఎంపి స్థానానికి పోటీ చేస్తున్న కావూరి లావణ్యను, ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర

సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ ఐవి. బి.వెంకట్, విజయరావు తదితరులు

- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - రంపచోడవరం (అల్లూరి జిల్లా)

బిజెపి హయాంలో అడవులను, సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలు తీవ్రమయ్యాయని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలో 'భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' పేరిట ఆదివారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యం, పౌర హక్కులకు మోడీ హయాంలో భంగం కలుగుతోందన్నారు. అటువంటి బిజెపికి రాష్ట్రంలో టిడిపి, జనసేనలు ప్రత్యక్షంగా, వైసిపి పరోక్షంగా మద్దతు తెలపడం దారుణమన్నారు. మోడీకి చంద్రబాబు, జగన్ ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ అభివృద్ధికి ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావులను గెలిపించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలకుల తీరుతో ఆదివాసీల బతుకులు రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నాయన్నారు. గిరిజనులకు ఈ మాత్రమైనా హక్కులు వచ్చాయంటే దానికి కారణం వామపక్ష పార్టీలే కారణమన్నారు. ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ దేశానికి కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న కేరళ రోల్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. గుజరాత్‌లో అభివృద్ధి డొల్లగా మారిందని విమర్శించారు. ఎన్‌డిఎ కూటమిని దేశ ప్రజలు ఓడించాలని, ఇండియా వేదికను గెలిపించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం వాణిశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కో - కన్వీనర్ కె విజయరావు, మాజీ ఐఎఎస్ అధికారి శ్రీనివాస్, ఇండియా బ్లాక్ నాయకులు పాల్గొన్నారు.

బిజెపి ఓటమితోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా మాట్లాడుతూ.. మతత్వాన్ని రెచ్చగొట్టి బిజెపి మరోమారు అధికారంలోకి వచ్చేందుకు చూస్తోందన్నారు. ఎన్నికల ప్రచారాల్లోనూ మతాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు మోడీ చేస్తున్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా బిజెపి పాలనలో పేదలను కొట్టి పెద్దలకు పంచిపెట్టారని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు దోచిపెట్టారని దుయ్యబట్టారు. మొదటి రెండు విడతల్లోనే జరిగిన ఎన్నికల తీరు చూస్తుంటే బిజెపికి ఓటమి తప్పదన్నది స్పష్టం అవుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా వేదిక సభ్యులకు ఓటు వేసి ఈ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. రాజ్యాంగం పరిరక్షించబడాలంటే ఇండియా వేదిక సభ్యులను గెలిపించుకోవాల్సిన అవసరముందని అన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ పదేళ్ల మోడీ పాలనలో ఎక్కడలేని విధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. 65 శాతానికి నిరుద్యోగం చేరిందని చెప్పారు. పది పోస్టులకు లక్ష మంది పోటీ పడే పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలన్నది మరచిపోయారని పేర్కొన్నారు. మతాన్ని రెచ్చగొడ్డటం.. సంపదను కార్పొరేట్లకు పంచిపెట్టడానికే మోడీ పదేళ్ల పాలన సరిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వి.మల్లికార్జున, అనంతపురం అసెంబ్లీ సిపిఐ అభ్యర్థి జాఫర్, రాప్తాడు కాంగ్రెస్ అభ్యర్థి శంకర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎ.గఫూర్, తదితరులు

గుంటూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన ర్యాలీలో జొన్న శివశంకరరావు, జంగాల అజయ్‌కుమార్

పోరాడే వారిని ఎన్నుకోండి

- సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలను పరిష్కరించని వారికి ఓటు వేయొద్దని, ప్రజల కోసం పోరాడే సిపిఎం నేతలను గెలిపిస్తే జనానికి మేలు జరుగుతుందని ఆ పార్టీ అభ్యర్థులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం చేపట్టారు. సిపిఎంను గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పేదలు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ప్రచారంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్‌టిఆర్ బిల్డింగ్స్‌లో పాణ్యం అభ్యర్థి డి గౌస్‌దేశాయ్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పాల్గొన్నారు. వీరి ప్రజలు అడుగడుగునా హారతులు పట్టి, పూల వర్షం కురిపించారు. ప్రజా కళాకారులు ప్రచారం ముందు భాగంలో డప్పులు వాయిస్తూ నృత్యం చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలను పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాంత పార్కులు, ఇతర స్థలాలను కబ్జా చేసి రౌడీ మూకలను ప్రోత్సహించారని విమర్శించారు. టిడిపి ఎమ్మెల్యేగా ఒకసారి గెలిచిన గౌరుచరిత కూడా పెద్దగా చేసిందేమిలేదన్నారు. అందుకే సిపిఎం తరుపున ఎమ్మెల్యే అభ్యర్థి డి.గౌస్‌దేశాయిని, కాంగ్రెస్ తరుపున ఎంపిగా పోటీ చేస్తున్న లక్ష్మీనరసింహయాదవ్‌ను గెలిపించాలని కోరారు.

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల కేంద్రంలో అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స విజయాన్ని కాంక్షిస్తూ ర్యాలీ, అనంతరం రచ్చబండ కూడలి వద్ద సభ నిర్వహించారు. ఈ ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం మాట్లాడుతూ.. బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే మైనింగ్ పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లోని అటవీ సంపదంతా అదానీకి అప్పగించేస్తుందని తెలిపారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పి సిపిఎం అభ్యర్థి అప్పలనర్స గెలుపునకు కృషి చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలంలోని కె.రామినాయుడువలస, గొట్టివలసలో కురుపాం అభ్యర్థి మండంగి రమణ ప్రచారం చేశారు. ఆయనకు గ్రామస్తులు హారతులతో స్వాగతం పలికారు.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని ఆత్మకూరు, తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం, కొలనుకొండలో సిపిఐ గుంటూరు ఎంపి అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, సిపిఎం మంగళగిరి అభ్యర్థి జొన్నా శివశంకరరావు రోడ్‌షో నిర్వహించారు. స్థానికులు వారికి ఎక్కడికక్కడ ఘనస్వాగతం పలికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు, వారిని గెలిపించాల్సిన అవసరాన్ని వివరించారు.

విశాఖ జివిఎంసి 74వ వార్డు పరిధిలోని దళ్లవానిపాలెం, ఎస్‌సి కాలనీ, అంబేద్కర్ కాలనీ, వియ్యపువానిపాలెం, సమతానగర్ జంక్షన్‌లో గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పాటుపడతానన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పెద్ద భీంపల్లి, ఇందుకూరుపేట, పోతవరం, అగ్రహారం కాలనీ తదితర గ్రామాల్లో రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు రోడ్ షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలంటూ జికె.వీధి మండలం ఎ.దారకొండ, చిలకవీధి, నల్ల ముక్కు గ్రామాల్లోనూ, జెర్రల వారపు సంతలోనూ సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం చేశారు.

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని నవాబుపేట, నజీర్‌తోట ప్రాంతాల్లో అభ్యర్థి మూలం రమేష్ ప్రచారం నిర్వహించారు. కార్మికుల, ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని తెలిపారు. నెల్లూరు నగరాభివృద్ధికి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు రోడ్ షో నిర్వహించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బిజెపి, టిడిపి, వైసిపి పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం మోడీతో కలిసి రాజధాని అమరావతి పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఇప్పుడు మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపిందన్నారు. ప్రజలందరూ ఆలోచించి సమస్యల పరిష్కారం కోసం పోరాడే వ్యక్తులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే గన్నవరం అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.

తమిళనాడు మెర్కాంటైల్ బ్యాంక్ లిమిటెడ్
TMB Tamilnad Mercantile Bank Ltd — Be a step ahead in life
L65110TN1921PLC001908
డో.నం.21-1-525 నుండి 527, గ్రౌండ్ ఫ్లోర్, లేన్ టు హై కోర్టు గేట్ నం.4 ఎదురు, లికబ్‌గంజ్, హైదరాబాద్-500002. ఫోన్: 040-24573494, 24570402, మొబైల్: +91 9177701971.
ఇ మెయిల్: hyderabad_rikabgunj@tmbank.in

డిమాండ్ నోటీసు
సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద

టు, రుణగ్రహీత/తనఖాదారు(లు)/హామీదారు(లు) : **1. మెసెర్స్. వెదమ్సా అగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్,** 3వ అంతస్తు, ఇ-69, మధురానగర్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038. **డైరెక్టర్లు : 1. శ్రీ.కపిల్ రెడ్డి లక్ష్మీపూర్, తండ్రి. ఎల్.నారాయణ రెడ్డి,** నం.39, 2వ అంతస్తు, ఎస్ఎల్ఎన్ అర్చన, హర్ష హాస్పిటల్ రోడ్డు, వైష్ణవి ఇఎన్‌సిఎల్, పెటబషీరాబాద్, తెలంగాణ-500055. **2. శ్రీ.బిలకంటి సుబ్బయ్య, తండ్రి. బి.నాగిశెట్టి,** నం.జి-6, బాలాజీ టవర్స్, 1వ అంతస్తు, ఎమ్ఆర్ఓ కార్యాలయం వద్ద, ఇ, చీమకుర్తి, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523223. **3. శ్రీ.గంగం వెంకట అనిల్ కుమార్ రెడ్డి, తండ్రి. జి.వి.నరసరెడ్డి,** ఫ్లాట్ నం.35 మరియు 36, సెంచురీ అవెన్యూ, ఎన్‌సిఎల్ ఇఎన్‌సిఎల్, ఎఎస పేట, బషీరాబాద్, హైదరాబాద్-500055. **4. శ్రీమతి. గంగం వెంకట జ్యోతి రెడ్డి, భర్త. గంగం వెంట అనిల్ కుమార్ రెడ్డి,** ఫ్లాట్ నం.35 మరియు 36, సెంచురీ అవెన్యూ, ఎన్‌సిఎల్ ఎన్‌క్లెవ్ ప్రక్కన, పేట బషీరాబాద్, హైదరాబాద్-500055.

డియర్ సర్/మేడం,

సబ్జెక్ట్ : రికబ్‌గంజ్ శాఖ వద్ద మెసెర్స్.వెదమ్సా అగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్/బిడి) ఎకౌంట్ నం.:213700150950056, మరియు టర్మ్ లోన్ జిఇసిఎల్ ఎకౌంట్ నం.213700460100046 ద్వారా పొందిన రుణానికి సంబంధించి సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.

మీ అభ్యర్థన మేరకు బ్యాంక్ తన రికబ్‌గంజ్ శాఖ ద్వారా షెడ్యూల్ ఎ లో పేర్కొన్న వివరాల ప్రకారం రుణగ్రహీత/రుణగ్రహీతలకు ఎప్పటికప్పుడు వివిధ క్రెడిట్ సౌకర్యాలను మంజూరు చేసింది. మీరు, రుణగ్రహీతలు పేర్కొన్న క్రెడిట్ సౌకర్యాలను తిరిగి చెల్లించే బాధ్యతతో క్రెడిట్ సౌకర్యాలను పొందారు మరియు బ్యాంకుకు అనుకూలంగా అవసరమైన రుణ పత్రాలను అమలు చేశారు మరియు షెడ్యూల్-బి లో చూపిన చరాస్తులకు సంబంధించి ఛార్జీని సృష్టించారు.

ఇంకా రుణగ్రహీత(లు)/ హామీదారులు/తనఖాదారులు సెక్యూరిటీగా షెడ్యూల్ సి లో పూర్తిగా వివరించబడిన ఆస్తికి సంబంధించి టైటిల్ డీడ్‌లను డిపాజిట్ డిపాజిట్ చేయడం ద్వారా తనఖాని కూడా సృష్టించారు.

బ్యాలెన్స్ నిర్ధారణ లేఖలు మరియు పునరుద్ధరణ లేఖలు మరియు ఇతర భద్రతా పత్రాలను కూడా ఎప్పటికప్పుడు అమలు చేయడం ద్వారా ఎగువ రుణ ఖాతా/(లు)లోని బాధ్యతను మీరు సక్రమంగా అంగీకరించారు. అంతేకాకుండా రుణగ్రహీత/రుణగ్రహీతలు ప్రధాన రుణం మరియ